# నయనానందకరం నందుల పండుగ



ప్రదానోత్సవ కార్యక్రమంలో కేరింతలు కొడుతున్న యువత

నెల్లూరు సాంస్కృతికం, జనవరి 24 (ఆన్‌లైన్): సంస్కృతి, సంప్రదాయాలను చాటే కళలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండదండలను అందిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. శనివారం రాత్రి జరిగిన నంది నాటకోత్సవాల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో నిర్వహించిన నంది నాటకోత్సవాలు జిల్లాలో విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. నంది నాటకోత్సవాల సందర్భంగా పలువురు అభిప్రాయాల మేరకు 4వ క్యాటగిరిలో బాలల కోసం ప్రత్యేక నాటక పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. భావి తరాలకు వారసత్వ సంపదగా కళలను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులు ఉంటాయన్న నమ్మకంతోనే భావితరాల కోసం బాలల నంది నాటకోత్సవాలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఏప్రిల్ 16న తెలుగు నాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ విధంగా రంగ స్థలాన్ని ప్రజల మధ్యకు తీసుకుపోయేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి అందరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాకు మినీ రవీంద్ర భారతి పథకం కింద జిల్లాకు మంజూరైన మినీ రవీంద్రభారతికి ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని సభికుల హర్షధ్వానాల మధ్య మంత్రి ప్రకటన చేశారు. ఈ సభకు నగర ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అధ్యక్షత వహించారు.

### శోభాయమానంగా బహుమతుల ప్రదానోత్సవం

తొలుత అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ రంగ స్థల జాతీయ పురస్కార్ అవార్డును కర్నూలు జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు అల్లాబకష్ మొల్లకు రాష్ట్ర మంత్రులు సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ పార్థసారధి, జిల్లా కలెక్టరు, శాసనసభ్యులు సమష్టిగా అందచేశారు. అనంతరం నంది నాటకోత్సవాలకు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించిన న్యాయనిర్ణేతలను ఘనంగా సత్కరించారు. జిల్లాకు చెందిన వృద్ధ కళాకారులు సురభి వనారస కోటేశ్వరమ్మ, టి ఎస్ రాయలు, మజ్జిగ చంద్రబాల, వనారస కోటేశ్వరి దేవీ, వి.సుందరరామయ్య, చంద్రసేన, బెల్లంకొండ రమణారావు, పగిడి ఓబయ్య, పి.చెంచయ్య, యడవల్లి రాఘవయ్య, మొలకల గోపాల్‌రెడ్డిలను సన్మానించి పారితోషికం అందచేశారు. సురభి నాటక సమాజాలు శ్రీవినాయక, శ్రీ వెంకటేశ్వర, భానోదయ, విజయభారతి, శ్రీశారద నాటక సమాజాలకు ఒక్కొక్క లక్ష రూపాయలు చొప్పున పారితోషికాన్ని అందచేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంది నాటకోత్సవాలు 2008 బహుమతి ప్రదానోత్సవ సభలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. హైదరాబాద్‌కు చెందిన గంగాధర్ అండ్ పార్టీ మ్యూజికల్ నైట్‌లో గాయనీగాయకులు చేసిన మధుర గానాలకు యువత ఉరకలేసి చిందులేసింది. శ్రీగురుకృప కళాక్షేత్రం విద్యార్థినుల స్వాగతం, సుస్వాగతం నృత్యం అలరించింది. నదియా, మాస్టర్ ఆదర్శ్‌ల కూచిపూడి, భరతనాట్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.రాంగోపాల్, ఎస్పీ మల్లారెడ్డి, జాయింట్ కలెక్టరు రాజేంద్రప్రసాద్, నంది నాటకోత్సవాల ప్రత్యేక అధికారి పి.రవిప్రకాష్, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ఎఫ్‌డీసీ సి.పార్థసారధి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ వాకాటి నారాయణరెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ తాళ్ళూరి రమణయ్యనాయుడు, జిల్లా ప్రణాళిక బోర్డు సభ్యులు ఆనం జయకుమార్‌రెడ్డి, నంది నాటకోత్సవాల న్యాయనిర్ణేతలు, నగర ప్రముఖులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

### ఉత్తమ పద్య నాటకాల విభాగంలో..

నంది నాటకోత్సవాలు 2008లో ఉత్తమ పద్య నాటకంగా డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయిబాబా నాట్య మండలి విజయవాడ కళాకారులు ప్రదర్శించిన ప్రథమ స్వాతంత్ర్య మహాసంగ్రామం 1857కు బంగారు నందితో పాటు 50వేల రూపాయలు నగదు, ప్రశంసా పత్రాన్ని మంత్రి సత్యనారాయణ ఆ కళామండలికి అందచేశారు. ఈ కళామండలి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నాటక రచయిత అవార్డులను టి. ఎస్.కృష్ణ వ్యక్తిగత అవార్డులను అందుకున్నారు. ఉత్తమ సహాయ నటి అవార్డుకు సురభి జమునా రాయల్ తామ్ర నంది, పది వేల రూపాయలు నగదు ప్రశంసాపత్రం అందుకుంది. ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ లైటింగ్ అవార్డులను కూడా ఆ కళాసమాజానికి చెందిన బి.యజ్ఞనారాయణ, పి.భాస్కర్‌శర్మ అందుకున్నారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనను ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్, కాకినాడ కళాకారులు ప్రదర్శించిన అల్లసాని పెద్దన పద్యనాటకంకు లభించింది. అదే నాటకంలో శ్రీకృష్ణదేవరాయల పాత్రధారి పి.నాగబాబుకు ఉత్తమ నటుడి అవార్డు లభించింది. ఉత్తమ నటిగా తారాశశాంకంలో తారగా నటించిన ఎస్.విమలాదేవికి, ఉత్తమ హాస్యనటులుగా జె.అర్జున, జె.వెంకయ్యలకు లభించింది. ఉత్తమ బాలనటుడిగా తారా శశాంకంలో నటించిన ఎస్.మాస్టర్ అజయ్‌దత్, ఉత్తమ ప్రతినాయకుడి అవార్డు గణపతి మహాత్యంలో టి వి ఎస్ సుబ్బారావుకు, ఉత్తమ రంగాలంకరణ అవార్డు తారాశశాంకం నాటకంకు, ఎస్.హరిబాబుకు దక్కింది. ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా నలదమయంతి నాటకానికి పని చేసిన పరమేశ్వర్‌కు లభించింది. ప్రత్యేక జ్యూరీ అవార్డు గణపతి మహాత్యంలో అర్జున పాత్రధారి పి.నాగిరెడ్డికి లభించింది.

### సాంఘిక నాటకాల విభాగంలో..

ఉత్తమ ప్రదర్శనగా సుచిత్ర ఆర్ట్స్ హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించిన బొమ్మలు చెప్పిన భజగోవిందం నాటకానికి బంగారు నంది లభించింది. అదే నాటకానికి ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ ప్రతినాయకుడు పాత్రలకు తామ్ర నందులు లభించాయి. ద్వితీయ ప్రదర్శనగా న్యూస్టార్ మోడరన్ థియేటర్స్ విజయవాడ కళాకారులు ప్రదర్శించిన జజ్జనకరి.. జనారే జనకుజనకు జనారే సాంఘిక నాటకానికి లభించింది. ఈ నాటకానికి ఉత్తమ దర్శకుడు అవార్డు కూడా లభించింది. ఉత్తమ నాటక రచయితగా సురక్ష (ఏలూరు) ద్వితీయ ఉత్తమ నాటక రచయితగా డి.విజయభాస్కర్, ఉత్తమ నటుడు ఎం. ఎస్.కె.ప్రభు (బాపుబాటలో), ఉత్తమ నటి సురభి ప్రభావతి (బాపుబాటలో), ఉత్తమ సహాయ నటి రమ్యకృష్ణ( సురక్ష) , ఉత్తమ హాస్య నటుడు జి ఎస్ చలపతి (జీవనవేదం), ఉత్తమ బాలనటుడు, నటి, హర్షిత్ (జీవన వేదం), కె. శ్రావ్య (సముద్రం), ఉత్తమ లైటింగ్ సురభి ప్రసాద్ (అఖండ విప్లవ జ్యోతి అంబేద్కర్), ఉత్తమ మేకప్‌మెన్ అశోక్‌పవార్ (అఖండ విప్లవ జ్యోతి అంబ్కేదర్), ప్రత్యేక జ్యూరీ అవార్డు అఖండ విప్లవ జ్యోతి అంబేద్కర్‌కు లభించింది.

### సాంఘిక నాటికల విభాగంలో..

ఉత్తమ ప్రదర్శనగా ఏలూరు హేలాపురి అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన ఎవరో ఒకరు నాటికకు బంగారు నంది 30వేల రూపాయల నగదు పురస్కారం, ప్రశంసా పత్రం లభించాయి. అదే నాటికకు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ తృతీయ నాటిక రచయిత, ఉత్తమ నటుడు, ఉత్తమ హాస్యనటులు, ఉత్తమ ప్రతి నాయకుడు అవార్డులు లభించాయి. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన తలుపు నాటికకు వెండి నంది, 20వేల రూపాయలు నగదు, ప్రశంసా పత్రం లభించాయి. ఆ నాటికకు ఉత్తమ నాటక రచయిత, ఉత్తమ నటి అవార్డులు లభించాయి. ఉత్తమ సంగీత దర్శకుడు అవార్డులు రమణ, శీను, రాజు, థామస్ ( ఓ లచ్చీ గుమ్మడి) ఉత్తమ సహాయ నటుడు ( ఆన్సర్), ఉత్తమ బాల నటి పి.శ్రావణి (నిరసన), ఉత్తమ రంగాలంకరణ (తప్పటడుగులు), ఉత్తమ లైటింగ్ రామకృష్ణ, నాగరాజులు (తప్పటడుగులు), ఉత్తమ మేకప్ థామస్ ( ఓ లచ్చి గుమ్మడి) ఈ విభాగంలో ప్రత్యేక జ్యూరీ అవార్డు పి.నరసింహారావు (తప్పటడుగులు)కు లభించాయి.

---

## మార్చి 23 నుంచి

## ఎస్ఎస్‌సీ పరీక్షలు

నెల్లూరు, జనవరి 24 (ఆన్‌లైన్): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 23 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి జలీల్ సాహెబ్ తెలిపారు. మార్చి 23న తెలుగు పేపర్ 1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాంపోజిట్ పేపర్ ఉదయం 9.30 నుంచి 12.30వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 24న తెలుగు పేపర్ 2 ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, కాంపోజిట్ పేపర్ 2 ఉదయం 9.30 నుంచి 10.30 వరకు, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 1 ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. 25న హిందీ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని డీఈఓ వివరించారు. 26న ఇంగ్లీషు పేపర్ 1, 28న ఇంగ్లీషు పేపర్ 2, 30న గణితం పేపర్ 1, 31న గణితం పేపర్ 2, ఏప్రిల్ 1న జనరల్ సైన్స్ పేపర్ 1, 2న జనరల్ సైన్స్ పేపర్ 2, 4న సాంఘిక శాస్త్రం పేపర్ 1 పరీక్షలు జరుగుతాయి. 6న సాంఘీక శాస్త్రం పేపర్ 2, 7న ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజి పేపర్ 2, 8న ఎస్ఎస్‌సి ఒకేషనల్ కోర్సు థియరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

---

## చినక్రాక రిజర్వాయర్‌కు 200 క్యూసెక్కుల నీరు: కలెక్టర్ ఆదేశం

జలదంకి, జనవరి 24 (ఆన్‌లైన్): కావలి కాలువ ఆయకట్టు పరిధిలోని చివరి ప్రాంతమైన జలదంకి మండలం చినక్రాక రిజర్వాయర్‌కు 200 క్యూసుక్కుల నీరు చేరేటట్లు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాంగోపాల్ ఆదేశించారు. శనివారం జరిగిన సోమశిల అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జలదంకి మండలంలో వరి పైరు సాగునీరందక ఎండుతున్న దృష్ట్యా కాలువ పరిధిలోని అన్ని మేజర్, మైనర్ కాలువలకు రైపేరియల్ చట్టం ప్రకారం నీటిని పంపిణీ చేయాలని ఆదేశించారు.

సోమశిల ఆయకట్టు పరిధిలో పంట ఎండకుండా చర్యలు చేపట్టాలని అధికా రులకు సూచించారు. చివరి ఆయకట్టుకు నీరందంచే వరకు కాలువకట్టపై టాస్క్‌ఫోర్స్ కమిటీలు తమ విధులను నిర్వహించాలని కలెక్టరు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## కొత్త కార్డులకు రేషన్ హుళక్కే!

(ఆన్‌లైన్, నెల్లూరు)

జిల్లాలో సుమారు 8,37,853 కార్డులున్నాయి. ఇందులో 6,43,137 తెల్ల రేషన్ కార్డులు కాగా, 1,36,510 పింక్ కార్డులున్నాయి. ఇవి కాకుండా అంత్యోదయ అన్నయోజన, అన్నపూర్ణ కార్డులున్నాయి. ఈ కార్డుల కోసం ఒక్క నెలలో 10,408.38 మెట్రిక్ టన్నులు బియ్యం సరఫరా అవుతోంది. వీటితో పాటు కొత్తగా చేరిన రేషన్ కార్డులకు బియ్యం కావాలంటూ పలుమార్లు జిల్లాలనుంచి ప్రభుత్వానికి నివేదికలందినా ఫలితం లేదు. కొత్త కార్డులు పొందిన వారికి రేషన్ బియ్యం అరచేతిలో వైకుంఠాన్ని తలపిస్తోంది. ప్రస్తుతం బియ్యం రేట్లు ఆకాశన్నంటుతున్న నేపథ్యంలో సామాన్యుడు మూడుపూటలు భోజనం చేయడం గగనమైంది. బహిరంగ మార్కెట్‌లో కేజీ బియ్యం కనీసం రూ.16 నుంచి రూ.34లు వరకు ధర పలుకుతుండడంతో ఇందుకు కారణంగా ఉంది. రోజంతా కష్టపడినా బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధర ముందు వారి కష్టం దిగదుడుపుగానే ఉంది.

జిల్లాలో కొత్త రేషన్ కార్డులు కోసం పోటీ పడి తెచ్చుకున్నవారు సరుకులు లేకపోవడంతో కొన్నిచోట్ల డీలర్లుపై తిరగబడుతున్నారు. ప్రభుత్వం కార్డులిచ్చి రేషన్ ఎందుకివ్వడం లేదంటూ నిలదీస్తున్నారు. దీంతో రేషన్ డీలర్లు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇందుకు కొన్ని చోట్ల అధికారులు అనుసరిస్తున్న విధానం కూడా కారణంగా ఉంది. మున్సిపాలిటీలు, కొన్ని మేజర్ పంచాయతీల్లో అదనంగా వచ్చిన బియ్యాన్ని కొందరు డీలర్లు కొత్త రేషన్ కార్డులకు పంపిణీ చేస్తున్నారు. దాంతో ఆ గ్రామంలో కొత్త రేషన్ కార్డులకు బియ్యం ఇస్తుండగా ఈ గ్రామంలో ఎందుకివ్వరు అంటూ కొందరు స్థానికులు రేషన్ డీలర్లపై ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు.

### ఇంకా కేటాయింపులు జరగలేదు: డీఎస్‌వో జ్వాలాప్రకాష్

జిల్లాలో రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతున్నందున కొత్త కార్డులకు ఇంకా సరుకులు పంపిణీ జరగలేదని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జ్వాలాప్రకాష్ తెలిపారు. కొత్త రేషన్ కార్డులకు ఇంకా కేటాయింపులు జరగలేదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ఆయన తెలిపారు.

## వివాదాస్పదంగా మారిన రోడ్డు శంకుస్థాపన

ఆత్మకూరు, జనవరి 24 (ఆన్‌లైన్): ఆత్మకూరు నియోజకవర్గం రాజకీయ వివాదాలకు వేదికగా మారింది. దీంతో పలుమార్లు అభివృద్ధి పనుల నిర్మాణాలు కుంటుపడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో తిరిగి రూ.3.83 కోట్ల నిధులతో మంజూరైన అప్పారావుపాళెం వీర్లగుడిపాడురోడ్డు

### ఇది పద్ధతి కాదు : కొమ్మి

### అధికారికమే : కాంగ్రెస్ నేతలు

### నేడు ఆత్మకూరుకు మంత్రి ఆనం రాక

శంకుస్థాపన కార్యక్రమం రగడగా మారింది. ఈ నెల 3న ఈ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి అధికారులెవ్వరూ హాజరు కాలేదు. అధికారిక కార్యక్రమం కాకపోవడంతో తాము హాజరుకాలేదని అప్పట్లో అధికారులు ప్రకటించిన విషయం విధితమే.



అప్పారావుపాళెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కొమ్మి (ఫైల్)

### నేడు ఆనంచే శంకుస్థాపన

ఈ నేపథ్యంలో తిరిగి అదే రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం సంక్షేమబాట కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆనం పర్యటన విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు శరవేగంతో పూర్తి చేశారు. శంకుస్థాపన చేసిన పనికే మంత్రి తిరిగి శంకుస్థాపన చేయడం మంచి పద్ధతికాదని ఎమ్మెల్యే కొమ్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాలంటే మరిన్ని అభివృద్ధి పనులు మంజూరు చేసి శంకుస్థాపన చేసుకుంటే సంతోషిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నేతలు మాత్రం అధికారులెవ్వరికీ తెలియకుండానే రోడ్డుకు శంకుస్థాపన చేశారని పేర్కొంటున్నారు. తన అనుచరుల ఇంటి గోడకు కొమ్మి శిలాఫలకం వేసినంత మాత్రాన అది అధికారిక కార్యక్రమం కాదని ఖండిస్తున్నారు. దీంతో ఆత్మకూరు మరో మారు రాజకీయ వివాదాలకు వేదికగా మారింది.